

నేడు మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఈ నెల 11న విద్యాశాఖ, తెలంగాణ గణిత ఫోరం సంయుక్తంగా జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్దేశ్వర్, శ్రీనివాసులు తెలిపారు. 29 మండలాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు తరలివచ్చి టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని వారు కోరారు.

రాష్ట్రంలో విద్యారంగం నిర్వీర్యం

విద్యాశాఖకు మంత్రిని నియమించరా?

బీసీ విద్యార్థి సంఘం

రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాషా

సంగారెడ్డిలో ధర్నా ఉద్రిక్తం 7



ఆశల అరెస్టు

చలో హైదరాబాద్‌కు పిలుపు

ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు

తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టు

తిరిగి స్వగ్రామాలకు.. 7



డబుల్.. గుబుల్

ఇళ్ల అప్పగింతలో జాప్యం

పదేళ్లుగా నిర్మాణంలోనే..

ఇప్పట్లో పూర్తయ్యేనా?

తప్పని ఎదురుచూపులు 7





సదాశివపేటలోని జిన్నింగ్ మిల్లు

రైతులకు నో ఎంట్రీ..
దళారులకు వెల్‌కమ్!

- సీసీఐ ద్వంద్వ ప్రమాణాలు.. పత్తి కొనుగోళ్లలో వివక్ష
- రైతుల నుంచి కొనుగోలుకు గేట్లు బంద్
- దళారుల వాహనాలకు బార్లా తెరుస్తున్న మిల్లులు
- సీసీఐ, ఏఎంసీ అధికారుల తీరుతో దళారులకే పత్తి అమ్మకం

6

దరి చేరే దారి కోసం!

317 జీవోతో నష్టపోయినవారికి బదిలీల్లో వెసులుబాటు

- సొంత జిల్లాలకు వెళ్లేందుకు సంప్రదింపులు
- పరస్పర బదిలీలకు 'వాట్సాప్' వేదిక
- కోరుకున్న జిల్లాకు వచ్చేందుకు టీచర్ల ఆసక్తి
- 'మ్యూచువల్' కోసం జోరుగా బేరసారాలు
- దరఖాస్తుకు ఈ నెల 30 వరకు గడువు



సంగారెడ్డిఅర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవో 317 కారణంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం తాజాగా స్పౌస్, మెడికల్, మ్యూచువల్ బదిలీలకు అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పరస్పర బదిలీలు కోరుకునే వారు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునేందుకు సర్కారు గడువు ఇచ్చింది. పరస్పర బదిలీలు జరగాలంటే ఇద్దరి అంగీకారం అవసరం. పరస్పర బదిలీ కోరుకుంటున్న ఇద్దరిలో ఒకరు జీవో 317 ద్వారా నష్టపోయిన వారై ఉండాలన్న నిబంధన ఉంది. ఈమేరకు 317 జీవోతో సొంత జిల్లాలను వదిలి ఇతర జిల్లాలకు బదిలీ అయిన వారిలో పరస్పర బదిలీకి సిద్ధమయ్యే వారి కోసం ఉపాధ్యాయులు అన్వేషణలో పడ్డారు.

జోరుగా బేరసారాలు

317 జీవో వల్ల నష్టపోయిన వారికి కొంత వెసులుబాటు కల్పించేందుకు తీసుకొచ్చిన పరస్పర బదిలీలు కొందరు ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాన్ని తెచ్చిపెట్టేలా ఉన్నాయి. పక్క జిల్లాల్లో ఉన్న వారు సొంత జిల్లా.. లేదా, కోరుకున్న జిల్లాలకు వచ్చేందుకు పరస్పర బదిలీలు ఉపయోగపడనున్నాయి. పరస్పర బదిలీల ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లేందుకు ఉద్యోగ విరమణ దగ్గరలో ఉన్నవారే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. వారి స్థానంలో ఇక్కడికి వచ్చే వారి మధ్య బేరసారాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. పరస్పర బదిలీల ద్వారా సంగారెడ్డి జిల్లాకు వచ్చేందుకు రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది. హెచ్ఆర్ఏ సౌకర్యం ఉన్న పాఠశాలల వారు అంతకుమించి డిమాండ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. పరస్పర బదిలీల్లో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య బేరసారాలు కూడా గుట్టుచప్పుడు కాకుండా అంతర్గతంగా చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతున్నది.

వాట్సాప్ గ్రూపులే వేదిక

పరస్పర బదిలీల కోసం ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపులే వేదికగా నిలుస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా గ్రూపులు ఏర్పాటు చేసుకొని బదిలీపై వెళ్లే వారు పనిచేస్తున్న పాఠశాల పేరు, కేటగిరీ, సెల్‌ఫోన్ నెంబర్లను పొందుపరుస్తున్నారు. ఏ జిల్లాలకు వెళ్లేందుకు సమ్మతిస్తున్నారో వాటి వివరాలను సంబంధిత గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు. బదిలీ అవసరమైన ఉపాధ్యాయులు వారిని సంప్రదిస్తున్నారు. 2022 మార్చిలోనే పరస్పర బదిలీలకు అప్పటి సర్కారు అనుమతివ్వగా పలువురు వినియోగించుకున్నారు. సర్కారు మరోసారి అవకాశం కల్పించడంతో చాలామంది ఉపాధ్యాయులు తమ సొంత జిల్లాలకు తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్పౌస్ కేటగిరీలో అవకాశం దొరకని వారు పరస్పర బదిలీకి ముందుకొస్తున్నారు.

బీఆర్ఎస్ నిరసనబాట

- ఇలాంటి పాలన ఎక్కడా చూడలేదు : సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- హస్తం గుర్తు కోసమే మార్పు : మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్ర : ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



సంగారెడ్డిలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు



హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సంగారెడ్డిటౌన్/హత్నూర/మెదక్‌మున్సిపాలిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణతల్లి విగ్రహ రూపురేఖల మార్పును నిరసిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్‌రెడ్డి, హత్నూర మండలం మండలం దౌల్తాబాద్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇలాంటి రాక్షస పాలన ఎన్నడూ చూడలేదని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చినా ప్రజల గుండెల్లో ఆ తల్లి రూపాన్ని చెరపలేరని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడ అధికారికంగా ఆవిష్కరించారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారని.. సంగారెడ్డి కలెక్టరేట్‌లో 2015 జూన్ 2న అప్పటి మంత్రి హరీశ్‌రావు తెలంగాణతల్లి అధికారికంగా విగ్రహాన్ని ఆవిష్కరించారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించింది తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాదని.. కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని అని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, మామిళ్ల రాజేందర్, పట్నం మాణిక్యం, మందుల వరలక్ష్మి మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీహరి, ఆర్.వెంకటేశ్వర్లు, నాగరాజ్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణగౌడ్, చక్రపాణి, శ్రవణ్ రెడ్డి, విఠల్, రమేష్, రామప్ప, నందకిషోర్, విష్ణు, అశ్విన్, రాజు, శ్రీకాంత్ , చిన్న, రాజేందర్‌నాయక్, మోహన్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలు కాదు.. బతుకులు మార్చండి

మెదక్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణతల్లి చేతిలో బతుకమ్మను తీసేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెయ్యి గుర్తు కోసమే తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారని ఆరోపించారు. అధికారంలో ఎవరు ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి కానీ, విగ్రహాలు మార్చడంపై కాదని అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను ఈ ప్రభుత్వం మంటగలిపిందని విమర్శించారు. విగ్రహాలను మార్చడంపై ఉన్న శ్రద్ధ హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. శాసనసభ సమావేశాల్లో కేసీఆర్ పాల్గొని కాంగ్రెస్ అరాచకాలను ఎండగడతారన్నారు. కార్యక్రమంలో నాయకులు బట్టి జగపతి, కృష్ణారెడ్డి, కృష్ణాగౌడ్, కిషోర్, ఆర్కెశ్రీనివాస్, ప్రభురెడ్డి,

మిగతా 8వ పేజీలో



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

650 ఓటర్లకు ఓ పోలింగ్ కేంద్రం

సంగారెడ్డి జిల్లాలో కొత్తగా 11 గ్రామపంచాయతీలు : కలెక్టర్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఓ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇదివరకు 647 గ్రామ పంచాయతీలు ఉండగా కొత్తగా మరో 11 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మొత్తం 658 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేనిచోట ప్రైవేటు భవనాల్లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధం చేసిన ముసాయిదా ఓటరు జాబితాను పోలింగ్ స్టేషన్‌లో ప్రదర్శించాలని సూచించారు. అభ్యంతరాలను ఈ నెల 12వ తేదీ లోగా తెలియజేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఈ నెల 7న జిల్లాలోని అన్ని మండలాలను గ్రామ పంచాయతీల్లో ముసాయిదా జాబితా ప్రచురించినట్టు కలెక్టర్ తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను ఈ నెల 13న పరిష్కరించి జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం అనంతరం 17న అన్ని మొండలాలు, గ్రామ పంచాయతీల్లో తుది జాబితా ప్రచూరించనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సాయిబాబా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అహ్మద్, మాణిక్, తాహేర్‌పాషా, ఎండీ యాకుబ్‌అలీ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కొడుకు ఆదరించని
తండ్రికి భూమి వాపస్

వారసత్వ భూపట్టాను తిరిగి మార్చి ఇచ్చిన అధికారులు



రేగోడు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో తన బాగోగులకు కొడుకు చూసుకోవడం లేదని, కొడుకు పేర ఉన్న వారసత్వ భూమిని తన పేర మార్చాలన్న తండ్రి విజ్ఞప్తిపై అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు మార్చిన పట్టా పాస్ బుక్ జిరాక్స్‌ను అతడికి మంగళవారం తహసీల్దార్ నరేష్ అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రేగోడు గ్రామానికి చెందిన సంగమేశ్వర్ రెడ్డి(77) తన కుమారుడు మైపాల్ రెడ్డి తన యోగాక్షేమాలు చూసుకోవడం లేదని, అతనిపై ఉన్న భూమిని తనపై మార్చాలంటూ 2024 జనవరిలో మెదక్ ఆర్డీవో, కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. దీన్ని పరిశీలించిన జిల్లా అధికారులు మైపాల్ రెడ్డిపై ఉన్న 1.03 ఎకరాల భూమిని తండ్రి సంగమేశ్వర్‌రెడ్డి పేరు మీద బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, ఈ మేరకు పట్టా మార్చి పాసుబుక్ జిరాక్స్‌ను అందజేశారు.

సంగమేశ్వర్‌రెడ్డికి పాస్ బుక్ జిరాక్స్ అందిస్తున్న తహసీల్దార్

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాల
క్రమబద్ధీకరణ రద్దు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి సీసీఎల్ఏ, కలెక్టర్ స్పందన
- చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- రద్దు చేసినట్టు ప్రకటించిన తహసీల్దార్ దేవదాసు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాల క్రమబద్ధీకరణ రద్దు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 'సర్కారు భూమికి ఎసరు' అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు సీరియస్‌గా స్పందించారు. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా 374/1 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించి, నిబంధనలకు విరుద్ధంగా క్రమబద్ధీకరణ చేసిన విషయం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. సదరు నిర్మాణాల క్రమబద్ధీకరణ రద్దు చేయాలని సీసీఎల్‌ఏ, కలెక్టర్ సంగారెడ్డి తాహసీల్దార్‌ను ఆదేశించారు. ఈమేరకు బలవంతుల మధుసూదన్‌రావు, ఎర్రోళ్ల రాంరెడ్డి, డీవకే శర్మ, కాలువగడ్డ భారతి, రాఘవేందర్, మోతిలాల్ సోలంకి, పొట్నూరి ఈశ్వరరావుల పేరిట ఉన్న క్రమబద్ధీకరణను రద్దు చేసి, ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు తహసీల్దార్ దేవదాసు తెలిపారు. మునిసిపాలిటీ జారీ చేసిన ఇంటి నంబర్లు, యాజమాన్య ధ్రువపత్రాలను ఇప్పటికే రద్దు చేశారు. జీవో 59 కింద పట్టణంలోని ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాల క్రమబద్ధీకరణ రద్దుచేసి, పునర్విచారణ చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తాహసీల్దార్ తెలిపారు.

మెదక్ వైద్య కళాశాలలో

16 నుంచి తరగతులు షురూ

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం బోధనకు ఏర్పాట్లు

మెడికల్ కాలేజీలో వసతులను పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌రాజ్



మెడికల్ కాలేజీలో వసతులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, డిసెంబరు 10 : మెదక్ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రత్యక్ష తరగతులు ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్నట్టు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పిల్లికొటాల్‌లో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలోని క్యాంటీన్, హాస్టల్, మెస్‌లను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేక చొరవతో మెడికల్ కాలేజీలో విద్యార్థులకు అన్ని వసతులతో హాస్టల్, క్యాంటీన్, మెస్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. నిరుపేదలకు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన మెడికల్ కాలేజీలో సంపూర్ణంగా వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ ప్రాంతవాసులు వినియోగించుకునేలా అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రినిపాల్ రవీంద్ర కుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త శివదయాల్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తపస్ నాయకులు

ధర్మాగ్రహ దీక్షను

విజయవంతం చేయండి : తపస్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన ధర్మాగ్రహదీక్షను విజయవంతం చేయాలని టీపీయూఎస్ (తపస్) రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్‌దేశ్ కోరారు. సంగారెడ్డిలో దీక్ష వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, అన్నిరకాల బిల్లులు చెల్లించాలని, పీఆర్సీ కమిటీపై ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

రాయపోల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామానికి సోమవారం రాత్రి తప్పిపోయి వచ్చిన మూగ బాలుడిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. గ్రామానికి బాలుడు తప్పిపోయి వచ్చిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి విచారించారు. బాలుడు చేగుంట మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన నాగభూషనం కుమారుడు శివలింగం అక్షయ్ కుమార్(13)గా గుర్తించారు. మంగళవారం బాలుడిని పెదనాన్న బూదయ్య, అక్క రేణుకకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మొక్కుబడిగా సీఎం కప్


సీఎం కప్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

మనోహరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడలు మొక్కుబడిగా సాగాయి. మండల స్థాయి క్రీడలకు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిలు హాజరై క్రీడలను ప్రారంభించారు. అయితే, మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా, కొన్ని గ్రామాలకు చెందిన క్రీడాకారులు మాత్రమే హాజరయ్యారు. వాస్తవానికి గ్రామాల్లో క్రీడలు నిర్వహించి మండల స్థాయికి ఎంపిక చేయాల్సి ఉండగా, అసలు కొన్ని గ్రామాలకు సమాచారం ఇవ్వకుండానే క్రీడలు నిర్వహించారు. కబడ్డీ నాలుగు టీంలు, వాలీబాల్ ఆరు టీంలతో పాటు మరికొన్ని క్రీడలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. చాలా గ్రామాల్లో తమకు అసలు సమాచారమే లేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సదాశివపేట మండలంలోని ఓ జిన్నింగ్ మిల్లులో పత్తి

రైతులకు నో ఎంట్రీ.. దళారులకు వెల్‌కమ్..

పత్తి కొనుగోళ్లలో వివక్ష ● అధికారుల తీరుతో రైతుల పరేషాన్

సదాశివపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు నో ఎంట్రీ.. దళారులకు వెల్‌కమ్ అన్నట్లు వ్యవహరిస్తున్నారు ఇక్కడి సీసీఐ అధికారులు. జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల గేట్లకు లారీల్లో, డీసీఎం, భారీ వాహనాల్లో తెచ్చిన పత్తి తీసుకోమని బోర్డులు పెట్టిన అధికారులు.. రైతులు తెచ్చిన సరుకును తిప్పి పంపుతూ.. వ్యాపారులు తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


నిబంధనలకు విరుద్ధంగా లారీలు, డీసీఎం వాహనాల్లో పత్తిని తీసుకొచ్చి తూకంకు సిద్ధంగా ఉంచిన దృశ్యం

బయటే కొనుగోళ్లు..

సీసీఐ కేంద్రాల నుంచి అధికారులు రైతుల పత్తి కొనుగోలు చేయకుండా వెనక్కి పంపిస్తుండటంతో కేంద్రాల బయటే టెంట్లు వేసుకున్న వ్యాపారులు కొనుగోళ్లు చేపడుతున్నారు. పత్తి క్వింటాల్‌కు సీసీఐ మద్దతు ధర రూ. 7521 ఉండగా, దళారులు.. వ్యాపారుల క్వింటా రూ. 6 వేల నుంచి రూ. 6,400 వరకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన పత్తిని మళ్లీ సీసీఐ కేంద్రంలోనే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా వ్యాపారులు క్వింటా పత్తిపైనే రూ. 2 వేల వరకు లాభం పొందుతున్నారు. వ్యాపారులతో కుమ్మక్కైన అధికారులు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేయకుండా, వెనక్కి పంపిస్తూ దళారుల దందాకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రైతులకు కొర్రీలు..

సదాశివపేట వ్యవసాయ మార్కెట్‌శాఖ పరిధిలో మూడు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఈ మూడు మిల్లుల్లో ప్రభుత్వం గత నవంబరు 4న సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 2,826 మంది రైతుల వద్ద 91,199.85 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి, దాదాపు రూ.68కోట్లు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, రైతులు ఆయా కేంద్రాలకు పత్తి తీసుకువస్తే తేమ శాతం, రంగు, క్వాలిటీ అంటూ కొర్రీలు పెడుతున్నారు.

స్పాట్ పేమెంట్

సీసీఐ కొనుగోలు చేసిన పత్తికి దాదాపు పది నుంచి పదిహేను రోజుల తర్వాత రైతు ఖాతాలో డబ్బులు వేస్తోంది. అయితే, బయటి వ్యాపారులు తేమ, రంగు, క్వాలిటీ అని సాకులు చెప్పకుండా సుమారు రెండు వేలు తక్కువకు కొనుగోలు చేస్తూ, వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారు. వెంటనే నగదు చేతికి వస్తుండటంతో రైతులూ బయటి వ్యాపారులకే పత్తి విక్రయిస్తున్నారు.

తగ్గిన దిగుబడి..

సదాశివపేట మండలంలో ఈ ఏడాది 33,500 ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. ఎకరాకు సుమారు 12 క్వింటాళ్ల మేర దిగుబడి రావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో దిగుబడి ఎకరానికి 6 క్వింటాళ్లు మించి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లెక్క తేలిస్తే..

రైతుల లెక్క ప్రకారం ఒక ఎకరానికి ఈ ఏడాది కనీసం 7 క్వింటాళ్ల దిగుబడి సైతం రాలేదు. ఈ నేపథ్యంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఏ ప్రాంతానికి చెందిన రైతు ఎకరానికి ఎన్ని క్వింటాళ్ల పత్తి విక్రయించాడు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారుల వద్ద ఉన్న పత్తిసాగు వివరాలు, రైతుల పేరిట పత్తి అమ్మకాలు జరిపిందెవరూ? వంటి వివరాలపై అధికారులు దృష్టి సారిస్తే సీసీఐ కేంద్రాల్లో అధికారులు చేసిన అక్రమాలు వెలుగులోకి వస్తాయని రైతులు అంటున్నారు.


సైంటిస్ట్- ఐఐటీ-హెచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్తలు

ఐఐటీ-హెచ్‌లో అంతర్జాతీయ సదస్సు

ఆరోగ్యంపై జీవనప్రక్రియల ప్రభావం మీద చర్చలు

కంది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై జీవన ప్రక్రియల ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ-హెచ్)లో అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఇండియన్ సొసైటీ ఫర్ క్రోనో బయాలజీ, కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ సంయుక్తంగా దీనిని నిర్వహించాయి. 'కార్సిడియన్ రిథమ్స్ ఇన్ హెల్త్ అండ్ డిసీజెస్: ఫ్రమ్ డిస్కవరీ టు ఫంక్షన్' (సీఆర్‌హెచ్‌డీ 2024) పేరిట ఈ నెల 5-7 తేదీల్లో మూడు రోజులపాటు జరిగింది. దీనికి సంబంధించిన వివరాలతో ఐఐటీహెచ్ మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆస్ట్రేలియా, డెన్మార్క్, ఐర్లాండ్, అమెరికా, బ్రిటన్, జపాన్, సింగపూర్, జర్మనీ, యూఏఈ, ఇజ్రాయెల్‌తో మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు. సీసీఎంబీ మాజీ డైరెక్టర్, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు సదస్సును ప్రారంభించి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాగా, సదస్సులో భాగంగా ఇండియన్ సొసైటీ ఫర్ క్రోనో బయాలజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ వినోద్ కుమార్‌కు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందించారు. ఈ సదస్సు భారతీయ క్రోనోబయాలజీ రంగం ప్రస్థానంలో ఒక మైలురాయి వంటిదని సదస్సు కన్వీనర్ సాందీపని రాయ్ పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేట క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు ఉన్నదంతా ఊడ్చుకెళ్లారు. సిద్దిపేట బృందావన కాలనీ వీధి నంబర్-3కు చెందిన కోడూరు అభినవ్ ఈ నెల 3న ఇంటికి తాళం వేసి, తన తల్లిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మంగళవారం వచ్చి చూడగా, తాళ పగిలి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలోని ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి వస్తువులు, రూ. లక్ష వేల నగదు ఎత్తుకెళ్లారు. అభినవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి.. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఐ ఉపేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

జహీరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ మండలంలోని గోవిందాపూర్ గ్రామశివారు అటవీ ప్రాంతంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో రూ.1.42 లక్షల నగదు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పది మందిని అరెస్ట్ చేసినట్లు జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజిరెడ్డి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానాలు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో పట్టుబడిన వారికి ఆయా మెజిస్ట్రేట్లు జరిమానాలు విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో నిర్వహించిన తనిఖీల్లో 23 మంది పట్టుపడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరు పరచగా, 23 మందికి రూ.31,000 జరిమానా విధించారు.

గజ్వేల్‌లో 18 మందికి..

గజ్వేల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మంది పట్టుపడ్డారు. వారిని మంగళవారం అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరుపరగా, వారికి రూ.11,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు.

ఇద్దరికి జైలు

కోహెడ/మద్దూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన ఇద్దరికి హుస్నాబాద్ న్యాయాధికారి ఏ. కృష్ణతేజ్ ఏడు రోజుల జైలుశిక్ష విధించారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో మొత్తం పది మంది పట్టుపడగా, అందులో ఇద్దరికి జైలు, మిగిలిన వారికి రూ. 12 వేల జరిమానా విధించినట్లు హుస్నాబాద్ ఎస్ఐ పి. అభిలాష్ తెలిపారు. అలాగే, జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండలం మేకలగట్టు గ్రామానికి చెందిన ఇస్లావత్ మధుకు ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారని మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తాం

మెదక్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగు సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేడుతామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన దివ్యాంగుల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరిస్తూ.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల అధైర్యపడొద్దని పాలన యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరగొద్దని, సమస్యలు పరిష్కరించి మీ ఫోన్‌కు సమాచారం ఇస్తామన్నారు. దివ్యాంగుల వైకల్యాలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక వైద్య నిపుణులతో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రత్యేక ప్రజావాణికి మొత్తం 65 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


దివ్యాంగుల వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

17న పోలింగ్ స్టేషన్ల జాబితా

గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 12లోపు సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో తెలపాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ నెల 7న జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీల్లో జాబితాను ప్రదర్శించామని, జిల్లాలో మొత్తం 491 గ్రామ పంచాయతీలు, 4210 వార్డులు ఉన్నాయన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 4210 కేంద్రాలను గుర్తిస్తూ.. ముసాయిదాను రూపొందించామన్నారు. ఈ నెల 12 అభ్యంతరాలు స్వీకరణ, 13న పరిష్కారం, 17న తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటన ఉంటుందన్నారు. అలాగే కలెక్టరేట్‌లో సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.


జహీరాబాద్ పట్టణ సమీపంలోని హోతి(కే)లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

డబుల్.. గుబుల్

వైఎస్సార్‌కాలనీ ఇళ్లకు పట్టిన గతే పడుతుందని భయం

- నిర్మాణం పూర్తయినా అప్పగింతలో జాప్యం
- పదేళ్లుగా అలంకార ప్రాయంగానే..
- కలగానే నిరుపేదలకు సొంతింటి కల

జహీరాబాద్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణ ప్రాంత నిరుపేద ప్రజలకు సొంతింటికల కలగానే మిగిలిపోతుంది. ప్రభుత్వాలు మారినా ఫలితం దక్కడంలేదు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. ఫలితంగా అవి శిథిలమై ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం పట్టణ సమీపంలోని అల్గోల్- బీదర్‌కు వెళ్లే రోడ్డు పక్కన అల్లానాసమీపంలో వైఎస్సార్‌కాలనీ పేరిట సుమారు 800 పైచిలుకు ఇళ్లను నిర్మించేందుకు అప్పట్లో పాలకులు నిర్ణయించారు. అందులో సుమారు 150 ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తికాగా, మరికొన్ని పునాది స్థాయి దశలో ఉన్నాయి. అప్పట్లో వీటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు వీలుగా జాబితాను సిద్ధం చేశారు. అందులో అనర్హులకు తోడు, నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం విషయంలో వివాదాల చోటుచేసుకోవడంతో ఆ పనులను అర్థాంతరంగా నిలిపివేశారు. అప్పటి నుంచి వాటిని పట్టించుకోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. ఇదిలా ఉండగా పదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణంలోని రహ్మత్‌నగర్‌లో 320, కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో 20 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. అలాగే హోతి(కే) గ్రామ సమీపంలో 10ఎకరాల స్థలంలో రూ.34.98 కోట్ల వ్యయంతో ఒక్కోబ్లాక్‌లో 24 ఇళ్లచొప్పున 27 బ్లాకుల్లో కలిపి 700 ఇళ్లను నిర్మించారు. ఇందులో 40 ఇళ్లు పస్తాపూర్‌లో లబ్ధిదారులకు కేటాయించారు. మరో 660 మాత్రం ఇప్పటికీ కేటాయించలేదు. దీంతో వీటికి కూడా వైఎస్సార్‌కాలనీ ఇళ్లకు పట్టిన గతే పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద భద్రత కొరవడిన నేపథ్యంలో గుర్తుతెలియని ఆకతాయిలు కిటికీలకు సంబంధించిన అద్దాలు ధ్వంసం చేశారు.

ఎన్నికల సమయంలో హడావుడిగా..

హోతి(కే) గ్రామశివారులో నిర్మితమైన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక గతేడాది శాసన సభ ఎన్నికల ముందు హడావుడిగా జరిగింది. మాజీమంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పలువురికి గృహప్రవేశాలు కూడా చేయించారు. ఇంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పంపిణీ అటకెక్కి అలంకార ప్రాయంగా మారాయి. అయితే ఎంపికైన కొందరు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు ఇచ్చి ఇంటి తాళాలు ఇవ్వలేదు. మరికొందరు అర్హులు జాబితాకే పరిమితమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై దృష్టి పెడుతుండడంతో ఈ డబుల్ బెడ్‌రూంల పరిస్థితి కొలిక్కి వస్తుందా, మళ్లీ లాటరీలు నిర్వహిస్తారా, కొత్తగ దరఖాస్తులు తీసుకుంటారా అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై సంబంధిత రెవెన్యూ అధికారులను డబుల్‌బెడ్ రూంల పరిసర ప్రాంతాల్లో, పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలో పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.


రెండుదశాబ్దాల క్రితం వైఎస్సార్ కాలనీలో నిర్మించిన ఇళ్ల దుస్థితి

ఆశల అరెస్టు

- చలో హైదరాబాద్‌కు వెళ్తుండగా..
- హైవే టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టు


తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు

తూప్రాన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలుతున్న ఆశ వర్కర్లను పోలీసులు సోమవారం రాత్రి నుంచి అడ్డుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా సహా.. వివిధ జిల్లాల నుంచి వాహనాల్లో తరలుతున్న ఆశ వర్కర్లను అడ్డుకుని అరెస్ట్ చేశారు. వారిని తిరిగి స్వగ్రామాలకు పంపించారు. ఇందుకోసం 44వ జాతీయ రహదారిపై మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు నిర్వహించారు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం ఆధ్వర్యంలో రాత్రి నుంచి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న పలువురు ఆశ వర్కర్లను అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తూప్రాన్ వద్ద పట్టుకున్న సుమారు 200 మందికిపైగా ఆశ వర్కర్లను తూప్రాన్, వెల్దుర్తి, శివ్వంపేట, చేగుంట, రామాయంపేట తదితర పోలీసుస్టేషన్లకు తరలించారు. తూప్రాన్ పోలీసు స్టేషన్‌లో వివిధ జిల్లాలకు చెందిన 51 మందిని అరెస్టు చేసి, సొంత పూచీకత్తుపై వదిలేశారు. మంగళవారం ఉదయం సైతం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు తనిఖీ చేసి ఆశలను తిప్పి స్వగ్రామాలకు పంపించారు.



ఆవాలతో చిత్రం

గజ్వేల్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని గజ్వేల్‌కు చెందిన రామకోటి రామరాజు ఆవాలతో కృష్ణ, అర్జునుడు, భగవద్గీత పుస్తక చిత్రాలను రూపొందించారు. ఆ చిత్రాన్ని మంగళవారం గజ్వేల్‌లోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు.

క్రైం కార్నర్

నీటి సంపులో పడి వ్యక్తి మృతి


కొండల్ రెడ్డి (ఫైల్)

సిద్దిపేట రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : నీటి సంపులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో చోటుచేసుకుంది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన మారెడ్డి కొండల్‌రెడ్డి(52) వ్యాపారం చేసుకుంటూ హైదరాబాదులో నివాసముంటున్నారు. ఈ నెల 9న సిద్దిపేటకు వెళ్తున్నాని కుటుంబ సభ్యులకు చెప్పి హైదరాబాద్ నుంచి వచ్చాడు. 9న సాయంత్రం భార్య సుజాత కొండల్‌రెడ్డికి ఫోన్ చేయగా ఇర్కోడు గ్రామంలోని తన అమ్మ ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. అదేరోజు రాత్రి 9.30 గంటలకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అర్ధరాత్రి సుజాతకు సోదరుడు నరసింహారెడ్డి ఆమె ఫోన్ చేసి కొండల్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద నీటి సంపులో పడి చనిపోయాడని తెలిపాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిట్స్ వచ్చి కిందపడి..

చేగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫిట్స్ వచ్చి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వడియారం గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా రేకులగి గ్రామానికి చెందిన గణపతి నానాపూర్ (40) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. చేగుంట మండల పరిధిలో ఓ రైస్‌మిల్‌లో వరిపొట్టు లోడు చేసుకుని వడియారం శివారులో కాంట వద్ద తూకం గురించి లారీ దిగుతుండగా ఆకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కిందపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాక, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక మున్సిపాలిటీలోని ధర్మాజీపేట వార్డులో చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం ధర్మాజీపేట వార్డుకు చెందిన నర్సింహులు(42) తన కుతూరు వివాహం కోసం చేసిన అప్పులను తీర్చలేక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఇంటికి వచ్చే చూసేసరికి తలుపులకు లోపల నుంచి గడియ వేసి ఉండడం, ఎంతసేపటికీ తీయకపోవడంతో చుట్టుపక్కలవారి సహాయంతో తలుపులను తీయగా నర్సింహులు మృతదేహం దూలానికి వేలడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో..


పోచయ్య(ఫైల్)

చిలప్‌చెడ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగన్నొల్ల పోచయ్య (50) ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల విషయమై తన భార్య శేఖమ్మతో తరచూ చెబుతూ మదనపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బయటికి వెళ్లిన అతను రాత్రి అయినా తిరిగి రాలేదు. మంగళవారం వెతకగా తన తమ్ముడు శ్రీనివాస్ పొలంలో వేప చెట్టు కింద పోచయ్య మృతదేహం కనిపించింది. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మిస్బావుద్దీన్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అగ్నిప్రమాదం.. లక్షన్నర దగ్ధం

అల్లాదుర్గం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని ఐబీ గిరిజనతండాలోని ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం జరగగా నగదు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన దేవసోత్ విఠిబాయి, కవిత మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటి నుంచి పొగలు రావడంతో కాలనీవాసులు గమనించి వారికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు మంటలను ఆర్పారు. ఈ ఘటనలో బీరువాలో దాచి ఉంచిన రూ.1.50 లక్షల నగదు, విలువైన ఇతర ధ్రువపత్రాలు, సామాగ్రి దగ్ధమైంది. వరిధాన్యం విక్రయించగా వచ్చిన నగదు కాలిపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లనట్లు తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.


ధర్నాలో మాట్లాడుతున్న సాయిబాష

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న సర్కార్

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాష
- ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని, అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా విద్యాశాఖ మంత్రిని నియమించకుండా కాలయాపన చేస్తున్నదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాష విమర్శించారు. సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి సంఘం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని అన్నారు. పక్క రాష్ట్రమైన ఏపీలో రూ.20వేల చొప్పున స్కాలర్‌షిప్పులు ఇస్తున్నారని, ధనిక రాష్ట్రమైన తెలంగాణలో రూ.5,500 ఇవ్వడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో 48 మంది విద్యార్థులు చనిపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెట్టేందుకు బడ్జెట్ ఉంటుంది కానీ, విద్యార్థులకు చెల్లించేందుకు బడ్జెట్ ఉండదా అని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ స్కాల్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాయిబాషాను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని సాయిబాష స్పష్టం చేశారు. నాయకులు ప్రదీప్‌గౌడ్, వర్ధన్‌గౌడ్, మణి, ప్రవీణ్, చింటూ, హరిప్రసాద్, రోహిత్‌గౌడ్, నాని, శివ, శ్యామ్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లన్న ఉత్సవాలు

టేక్మాల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాద్లూర్ గ్రామంలోని మల్లికార్జునస్వామి ఉత్సవాలు నేటి నుంచి ఐదురోజులపాటు జరగనున్నాయి. కొండల నడుమ కొలువైన స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి క్రూడా భక్తులు తరలివస్తారు. ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రోజువారీ కార్యక్రమాలు..

11న బోనాలు సమర్పణ, 12న బండ్ల శకటోత్సవం, 13న కుస్తీ పోటీలు, 14న రథోత్సవం, 15న బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నారు. కుస్తీ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతితోపాటు ఐదు తులాల వెండి కడియాన్ని బహూకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరవుతారని తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రేమికుల వివాహం

అల్లాదుర్గం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం పట్టణానికి చెందిన ఎనుగండ్ల నరేష్, అదే గ్రామానికి చెందిన లావణ్య మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి పెళ్లికి అమ్మాయి కుటుంబీకులు అంగీకరించలేదు. దీంతో ఆ జంట మంగళవారం అల్లాదుర్గం పోలీసులను ఆశ్రయించి ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లోనే వివాహం చేసుకున్నారు. అబ్బాయి తల్లిదండ్రులతో కలసి పోలీసులను ఆశ్రయించిన జంటకు ముందుగా ఎస్ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా పెళ్లి చేసుకుంటామని చెప్పడంతో వివాహం జరిపించారు.



కుష్ఠుపై భయాందోళన వద్దు

రాష్ట్ర మానిటరింగ్ అధికారి సరస్వతి


సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర మానిటరింగ్ అధికారి సరస్వతి

నారాయణఖేడ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిపై ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర మానిటరింగ్ అధికారి సరస్వతి అన్నారు. మంగళవారం ఖేడ్ పరిధిలోని నిజాంపేటలో నిర్వహిస్తున్న కుష్ఠు వ్యాధి గ్రస్తుల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రే బ్యాక్టీరియాతో వ్యాపిస్తుందన్నారు. ప్రధానంగా చర్మానికి, నరాలకు సోకుతుందని, నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడు నుంచి ఐదు సంవత్సరాలు పడుతుందన్నారు. వ్యాధి సోకిన వారు ఎలాంటి భయానికి గురికావాల్సిన అవసరం లేదని, బహుళ ఔషధ చికిత్స విధానంతో ఆరు నెలల నుంచి 12 నెలల్లో నయం చేయవచ్చన్నారు. ఈ వ్యాధిపై ఎలాంటి అనుమానాలున్నా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఆమె వెంట డిప్యూటీడీఎంఅండ్‌హెచ్‌వో సంధ్యారాణి, మెడికల్‌ఆఫీసర్‌రాజేశ్వర్, శేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

శివ్వంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఆటోను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మంగళవారం ఉసిరికపల్లి చౌరస్తాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఉసిరికపల్లి చౌరస్తాలో రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్నారని సమాచారంతో తనిఖీ చేయగా 11 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. దీంతో ఆటోను అదుపులోకి తీసుకొని సివిల్ సప్లై అధికారుకు అప్పగించారు. ఆ అధికారుల ఫిర్యాదు మేరకు రేషన్ బియ్యం తరలిస్తున్న భువనగిరికి చెందిన ధనావత్ లింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

నారాయణఖేడ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అది విరిగిపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున ఖేడ్ నుంచి కరసగుత్తి వైపు వెళ్తున్న కారు ఒక్క సారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపడగా, కారు ముందటి భాగం ధ్వంసమైంది. ఆ సమయంలో వాహనాల రద్దీ ఎక్కువ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



త్వరలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పక్కా భవనం: మెదక్ ఎమ్మెల్యే

మెదక్ అర్బన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన ఏడాదిలోనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు చేసిందన్నారు. త్వరలో పక్కా భవనం ఏర్పాటు చేస్తామన్నారు. పలు మండలాల్లో కొత్త పోలీస్‌స్టేషన్ భవనాల కోసం సీఎంకు ప్రతిపాదనలు అందజేశానన్నారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

చిన్నశంకరంపేట/కంగ్టి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేటలోని ఎస్సీ హాస్టల్‌ను షెడ్యూల్ కులాల అధికారి శశికళ మంగళవారం ఆకస్మిక సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. అదేవిధంగా కంగ్టిలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో సత్తయ్య సందర్శించి, వసతులను పరిశీలించారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

● సంగారెడ్డి ఎస్పీ రూపేష్



డాక్టర్ అనూషరావుకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఈ క్రమంలో తమ ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించుకోవాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా పోలీసు మహిళా అధికారులు, సిబ్బందికి మహిళల ఆరోగ్య సంబంధిత సమస్యలపై జడ్పీ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో మగవారితో సమానంగా విధులు నిర్వహిస్తూ, ఉద్యోగ, కుటుంబ పరిస్థితుల రీత్యా పని ఒత్తిడికి లోనవుతూ వివిధ రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలు తమ ఆరోగ్య విషయమై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యశోద హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ అనూషరావు మాట్లాడుతూ.... పోలీసుశాఖలో తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ఒత్తిడిని అధిగమించడానికి యోగా, వ్యాయామం వంటివి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, అడ్మినిస్ట్రేటీవ్ అధికారి కళ్యాణీ, డాక్టర్‌జ్యోతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

రాజీకి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో ఇరువర్గాలను అందుకు ఒప్పించేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. జిల్లా పోలీసు అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు కోల్పోయిన డబ్బును త్వరగా వారికి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ సంజీవ రావు, డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు విజయకృష్ణ, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 41 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 15,218 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతించరని, పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో అభ్యర్థుల సౌకర్యార్థం బస్సుల సమయాలను మార్చాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీపీవో సాయిబాబ, డీఈవో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డా. గాయత్రి, ఇంటర్మీడియట్ అధికారి గోవింద్‌నాయక్, తహసీల్దార్ దేవదాస్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సీఎం కప్ మండలస్థాయి క్రీడలు ప్రారంభం



నర్సాపూర్: క్రీడల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


సంగారెడ్డి అంబేడ్కర్ మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడలను పురస్కరించుకొని మంగళవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల్లో మండలస్థాయి పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయి పోటీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ప్రస్తుతం మండలస్థాయి క్రీడల్లో పోటీపడుతున్నారు. ఈ పోటీలు ఈ నెల 12వ తేదీ వరకు జరుగనున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఆయా మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు హాజరై పోటీలను ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర మండలస్థాయి క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయడానికే సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.


చిన్నశంకరంపేటలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు



నారాయణఖేడ్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీవో, మున్సిపల్ చైర్మన్, తూప్రాన్‌లో క్రీడాకారులతో మున్సిపల్ చైర్‌పర్సన్, ఆర్డీవో, కమిషనర్

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా బషీర్ అహ్మద్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) రాష్ట్ర కార్యదర్శిగా ఎం.ఏ. బషీర్ అహ్మద్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వత్‌రెడ్డి, సదానంద గౌడ్‌ల చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందజేశారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కె.అశోక్, ప్రధాన కార్యదర్శిగా బి. సాయిలు, ఉపాధ్యక్షులుగా ఎం. సువర్ణ, జే.కాశీనాథ్, కోశాధికారిగా పి. శ్రీనివాస్‌రావు, కార్యదర్శులుగా ఎం. అమరేశ్వరి, ఎం. శామయ్య, బి. సాయితేజ, బి.అరుణశ్రీ, ఎండీ సంయుద్దిన్, ఎం. నరసయ్య, ఏ.జగన్‌మోహన్, ఎం.నరేష్, ఏ. కృష్ణకుమారి, వి.అనురాధ, సీహెచ్. విఠల్, ఆర్. సింహాచలంలు ఎన్నికయ్యారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా చందర్ రాథోడ్, సభ్యులుగా కె. హరిసింగ్, పి. ప్రసన్న, ఎండీ సిరాజొద్దిన్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ కౌన్సిలర్స్‌గా జి. విశాలి, ప్రశాంత్‌కుమార్, ఎం. విజయ్‌కుమార్, బి. శివరాజ్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులచే రాష్ట్ర ఎన్నికల అధికారులు చావా రవి, లక్ష్మారెడ్డి, మంజరి ప్రమాణ స్వీకారం చేయించారు.

మానవ హక్కుల వేదిక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మెదక్/మెదక్ అర్బన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): ఈ నెల14, 15వ తేదీల్లో జరిగే మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ అహ్మద్ పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ భవనంలో మహాసభల పోస్టర్‌ను ప్రజా సంఘాల నేతలు ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి , జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, సీఐటీయూ నాయకులు మల్లేష్, జర్నలిస్ట్ సంఘం నాయకుడు నాగరాజు, మన హక్కుల సంఘం కార్యకర్తలు, టీపీటీఎఫ్ నాయకులు పోస్టర్ ఆవిష్కరణ చేశారు.

దోమడుగులో అంగన్‌వాడీలకు వర్క్‌షాప్

గుమ్మడిదల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దోమడుగు గ్రామంలో మండలంలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్స్ వర్క్ షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పలు అంశాలపైన చర్చించి అంగన్‌వాడీ పాఠశాలలు అభివృద్ధి, పిల్లలకు అందించాల్సిన పౌష్టిక ఆహారం వివిధ అంశాల పైన చర్చించి నోట్ చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు. వివిధ గ్రామాల చెందిన అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన హామీ నెలబెట్టుకోవాలి


సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరవధిక దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. సమ్మెకు టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ సంఘీభావం తెలిపారు.

● మెదక్ అర్బన్/ మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో కీలకంగా వ్యవహరిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. ఈ నెల 6 నుంచి కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. వీరికి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి సంఘీభావం తెలిపారు. సంఘీభావంలో తెలిపిన వారిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలను అరికట్టాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడుకొంగటి యాదగిరి

మెదక్ అర్బన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): 'పైరవీలకు ఆర్థిక శాఖ నిలయంగా మారింది.. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో ఉన్న అక్రమాలను అరికట్టాలి' అని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంగటి యాదగిరి ఆరోపించారు. మంగళవారం స్థానిక సంఘ భవనంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ఉద్యోగులు తాము దాచుకున్న జీపీఎఫ్ పార్ట్‌ఫైనల్, అడ్వాన్స్‌లు చెల్లించడం ఏళ్లుగా పెండింగ్‌లో ఉందన్నారు. జిల్లాలో ఒక క్రమ పద్ధతి లేకుండా జీపీఎఫ్ చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. గతేడాది ఏప్రిల్, మే చెల్లింపులు చేయకుండా ఈ ఏడాది మే చెల్లింపులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా క్రమ పద్ధతిలో సీనియారిటీ ప్రకారం చెల్లింపులు జరపాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్ ఈఎస్ఐ డిస్పెన్సరీ తనిఖీ

తూప్రాన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఈఎస్ఐ (శభాష్‌పల్లి) డిస్పెన్సరీని మంగళవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈఎస్ఐ డిస్పెన్సరీలో వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులపై ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

శివ్వంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శివ్వంపేటకు చెందిన ఆటో డ్రైవర్ పెద్ద కోళ్ల సంజీవ్ తన ఆటోకు ఈఎంఐ కట్టలేని పరి స్థితిలో ఈనెల 1నఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో మృతుడి కుటుంబానికి మంగళవారం నర్సాపూర్ తూప్రాన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు కొడకంచి అంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లందరూ కలిసి రూ.5 వేలు పోగుచేసుకుని ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నాగేష్, అనిల్, గౌస్, సలీం, నర్సింలు, ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

మానవ హక్కుల రక్షణ బాధ్యత సమాజంపైనా ఉంది



సంగారెడ్డిలోని మెద్వాన్ సంస్థ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి రమేష్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు సమాజంపై కూడా ఉన్నదని జిల్లా న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని మెద్వాన్ సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మానవహక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో ఎలాంటి రకమైన వేధింపులు జరిగినా వాటిని అరికట్టేందుకు చట్టాలు ఉన్నాయని తెలిపారు. గృహ కార్మికులందరూ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా ఉచిత న్యాయసేవలకు సిద్ధంగా ఉన్నామని, అవసరమైన వారు సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం మెద్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పుట్టిన ప్రతీ వ్యక్తి వివక్ష లేని జీవితం గడపాలని ఆకాంక్షించారు. కార్మికుల హక్కులకు భంగం కలిగినప్పుడు కోర్టుల ద్వారా న్యాయం పొందాలని చెప్పారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు వెంకటేశ్, మెద్వాన్ సంస్థ కో ఆర్డినేటర్లు స్వప్న, ముజీబ్, గృహ కార్మికులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన

జిన్నారం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మోడల్ పాఠశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బొల్లారం మోడల్ పాఠశాలలో లీగల్ సర్వీసెస్ కమిటీ సెక్రటరీ రమేష్ విద్యార్థులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థినులకు ఎలాంటి లీగల్ సమస్యలు ఉన్నా 15100 నెంబర్‌ను సంప్రదించి, సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సీఐ రవీందర్ రెడ్డి, లీగల్ సర్వీసెస్ మండల వలంటీర్ శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నిరసనబాట

(5వ పేజీ తరువాయి)


మెదక్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మల్లేషం, లింగాంరెడ్డి, జుబేర్, కిష్టయ్య, ఆంజనేయులు, శ్రీకాంత్, సాంబశివరావు, ఎలక్షన్‌రెడ్డి, ప్రభాకర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చాక తొలగిస్తాం

తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విమర్శించారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే తెలంగాణ అస్తిత్వానికి దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర సచివాలయం ఎదుట కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని నెలకొల్పి తెలంగాణ తల్లి అంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని తొలగించి గాంధీభవన్‌కు పంపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, నర్సింహులు, హరికృష్ణ, అశోక్‌గౌడ్, చంద్రాగౌడ్, రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, శివశంకర్‌రావు, రవికుమార్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి సింగూరు జలాల సరఫరా ఉండదు

పుల్కల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):యాసంగి సీజన్‌లో వరి సాగు చేసేందుకు సింగూరు జలాలను సరఫరా చేయడం లేదని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని పుల్కల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ముదిమాణిక్యం పీఏసీఎస్ చైర్మన్ మల్లన్నగారి దుర్గారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన పుల్కల్‌లో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి దామోదర రాజనరసింహ ఈ నెలాఖరులో సింగూరు కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులను ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే యాసంగి వరి సాగుకు జలాల విడుదల ఉండదన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగంచేసుకోవాలి

రాయికోడ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య కోరారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద 136మంది లబ్ధిదారులకు మంజూరైన కోటి 36 లక్షల 15,776 వేల చెక్కులతోపాటు 19 మంది లబ్ధిదారులకు రూ.7.91 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలోతహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ వినయ్, పీఏసీఎస్ చైర్మన్‌నాగొెట్టి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బాలాజీనర్సింలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్టిజన్‌పై దాడిచేసిన ఏఈపై చర్యలు తీసుకోవాలి

తూప్రాన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం రామాయలపల్లి పోల్ టు పోల్ వర్కర్ (ఆర్టిజన్)పై దాడి చేసిన వెల్దుర్తి ఏఈపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీయూ(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు మన్నె నర్సింలు డిమాండ్ చేశారు. మంగళవారం తూప్రాన్ డివిజన్ డీఈకి ఏఈపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సోమవారం శెట్‌పల్లి గ్రామానికి ఎల్‌సీ విషయంలో ఏఈ కల్పించుకొని ఆర్టిజన్ నర్సింగ్‌నాయక్‌ను తిడుతూ కాళ్లతో తన్ని రాడ్‌తో కొట్టి తీవ్రంగా గాయపర్చినట్లు వివరించారు. ఈ విషయంలోచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆశ వర్కర్ల ముందస్తు అరెస్టులు


పుల్కల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశవర్కర్లు

న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాలు, గ్రామాల నుంచి 'చలో హైదరాబాద్'కు తరలివెళ్తున్న ఆశ వర్కర్లను పోలీసులు మంగళవారం ఎక్కడిక్కడ ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గత ఏడాది ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ ఇతర చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళన కార్యక్రమాలకు సీఐటీయూ నాయకులు పూర్తి మద్దతు తెలిపారు. ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన ఆశా వర్కర్లను సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు పరామర్శించారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న ఆశ వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. నారాయణఖేడ్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు నిరసన ప్రదర్శనలు చేశారు. మెదక్ జిల్లా రామాయంపేటలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణితో పాటు నాగలక్ష్మీ, పద్మ, జ్యోతి తదితరులను హైదరాబాద్ వెళ్లకుండా సోమవారం అర్ధరాత్రి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని మంగళవారం మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వెల్దుర్తి, మనోహరాబాద్ మండల కేంద్రాల్లో ఆశ వర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా చిన్నశంకరంపేట, పెద్దశంకరంపేట, వెల్దుర్తి, మండలాల్లో ఆశ వర్కర్లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.


తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సరికాదు: బీఆర్ఎస్


జహీరాబాద్‌లోని భవానీమందిర్ చౌరస్తా తెలంగాణతల్లి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుల క్షీరాభిషేకం


తూప్రాన్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్/జిన్నారం/తూప్రాన్/మనోహరాబాద్/వెల్దుర్తి/రామయంపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడంపై సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఎంతో కీలకంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చివేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు ఆక్షేపించారు. బీఆర్ఎస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు జహీరాబాద్ పట్టణంలోని భవానీమందిర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణతల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిన్నారం మండలం వావిలాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో ప్రభుత్వం నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం తగదని వారు పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణ నర్సాపూర్ చౌరస్తా వద్దగల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపి, విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నినాదాలు చేశారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి, కూచారం, పర్కిబండ గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెల్దుర్తి మండల పరిధిలోని శెట్టిపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి తాజామాజీ సర్పంచ్ లతాశ్రీనివాస్‌గౌడ్, నాయకులు పూల మాల వేసి క్షీరాభిషేకం నిర్వహించారు. రామాయంపేటలో తెలంగాణతల్లి విగ్రహానికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.

బసవేశ్వరుడిని విమర్శించడం తగదు


మాట్లాడుతున్న రాష్ట్రీయ బసవదళ్ రాష్ట్రఅధ్యక్షుడు శంకరపాటిల్

జహీరాబాద్ డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోకి బీజాపూర్‌కు చెందిన ఎమ్మెల్యే బస్వన్నగౌడ్ పాటిల్ విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడిని విమర్శించడం తగదని రాష్ట్రీయబసవదళ్ రాష్ట్రఅధ్యక్షుడు శంకరప్పపాటిల్ పేర్కొన్నారు. పట్టణంలోని దత్తగిరికాలనీలో గల బసవమండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచానికే ఆదర్శమూర్తిగా వెలుగొందిన విశ్వగురు అయిన బసవేశ్వరుడి గురించి విమర్శించిన తీరును ఆయన తప్పుపట్టారు. బసవేశ్వరుడు నదిలోపడి ఆత్మహత్యచేసుకున్నాడని అపోహలు సృష్టించాడన్నారు. బసవేశ్వరుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివ్యక్తి కాదంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండించారు. విమర్శలను వెనక్కి తీసుకుని, యావత్తు సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లింగాయత్‌సమాజ్, రాష్ట్రీయ బసవదళ్ నాయకులు మడుపతి బస్వరాజ్, రేకుళిగి సుభాష్, శరణప్ప, సమాజ్ నాయకులు పాల్గొన్నారు.